క్లుప్తంగా

మంత్రి కాకాణి పరామర్శ



వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నలగర్ల నరసింహారావు, రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ నలగర్ల భారతిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల నరసింహారావు తల్లి సంపూర్ణమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఉత్తరక్రియలను గురువారం నిర్వహించారు. మంత్రి కాకాణి హాజరై సంపూర్ణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైస్‌ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కే మోహన్‌నాయుడు, నాయకులు ఏ ప్రభాకర్‌రెడ్డి, కే విజయభాస్కర్‌నాయుడు, మంచు వెంకటేశ్వర్లునాయుడు, నలగర్ల రంగయ్య, తదితరులు ఉన్నారు.

కృష్ణపట్నం పోర్టులో మెగా వైద్యశిబిరం



ముత్తుకూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆదాని కృష్ణపట్నంపోర్టులో అపోలో స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో గురువారం మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అపోలో వైద్యసిబ్బంది పోర్టు ఉద్యోగులకు వైద్యపరీక్షలు చేశారు. జూన్ 5వ తేదీ వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని సీఎస్సార్ హెడ్ రాజేష్‌రంజన్ తెలిపారు. ఈహెచ్ఎస్ హెడ్ వేణుగోపాలరెడ్డి, హెచ్ఆర్ డీజీఎం శ్రీనివాసులు, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ రంజిత్, డాక్టర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలి

కొడవలూరు: అడాల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి కోరారు. మండలంలోని నార్నురాజుపాళెంలో గురువారం నిర్వహించిన అడాల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వ్యాక్సినేషన్‌లో వైద్య సిబ్బంది తీసుకుంటున్న జాగ్రత్తలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూమపానం అలవాటు ఉన్న 18 ఏళ్ల వయస్సు పైబడిన వారు క్షయ బారిన పడకుండా అడాల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను విధిగా వేయించుకోవాలన్నారు. మధుమేహ వ్యాధితో బాధపడుతున్న, గత ఐదేళ్లలో క్షయ వ్యాధితో బాధపడి కోలుకున్న వారు, వారి కుటుంబ సభ్యులు, 60 ఏళ్ల పైబడిన వారు క్షయ వ్యాధి బారిన పడకుండా విధిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బాలచంద్రబాబు, సీహెచ్ఓ సోమశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీలు సరోజ, స్నేహ, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్ఎం దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తోట ప్రభాకర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు తోట ప్రభాకర్ తెలిపారు. నగరంలోని సుజాతమ్మకాలనీలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు కోసూరు గోవిందయ్యగౌడ్ ఆశయ సాధన మేరకు ఏటా పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామని తెలిపారు. అర్హత కలిగి పది విద్యార్థులు జూన్ 30లోగా ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 81424 42333 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ముత్యంగౌడ్, శ్రీనివాసులు, రామచంద్రయ్యగౌడ్, వెంకటసుబ్బయ్య, తాతా సుబ్బారావు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, రంగన్న, మల్లికార్జున్, వంశీ తదితరులు, పాల్గొన్నారు.

మారిన ప్రభుత్వ బడుల రూపురేఖలు



రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన వరకవిపూడి పాఠశాల ముఖద్వారం



పొదలకూరులోని డీఎన్నార్ పాఠశాలలో నిర్మించిన వాకింగ్‌ట్రాక్

- నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
- పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య



మనుబోలులో సీఎంనగర్ పాఠశాలలో టీవీ ద్వారా బోధన(ఫైల్)

మనుబోలు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులకు అన్ని రకాల వసతులు సమకూరాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను కల్పించారు. గతంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు, పెచ్చులూడి పడే గదులు, వెలిసిపోయిన గోడలు కలిగిన పాఠశాలల్లో విద్యార్థులు చదువును అభ్యసించేవారు. మరుగుదొడ్లు లేక ఆరు బయటకు వెళ్లాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని గమనించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సంకల్పించి నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ద్వారా దశలవారీగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణలో భాగంగా అదనపు గదుల నిర్మాణం, దెబ్బతిన్న గదులకు మరమ్మతులు, తాగునీటి సరఫరా, నిరంతర నీటి సరఫరాతో పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు నాణ్యమైన ఫర్నిచర్, ప్రతి తరగతి గదిలో టీవీలు, గ్రీన్ చాక్‌బోర్డు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజనానికి వంటగదులు, ప్రహరీలను నిర్మించారు. జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు నాణ్యమైన బూట్లు, బ్యాగులు, యూనిఫామ్ అందజేశారు. జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ ద్వారా డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారు. దీంతో పేద పిల్లలు ఆడుతూ పాడుతూ పాఠశాలల మెట్లెక్కి విద్యను అభ్యసిస్తున్నారు.

సర్వేపల్లి నియోజకవర్గంలో ఇలా..	
ప్రభుత్వ పాఠశాలలు	367
నాడు–నేడు ద్వారా ఆధునీకరించినవి	256
నాడు–నేడుకు వెచ్చించిన నగదు	రూ.70.53 కోట్లు
మొత్తం ఉపాధ్యాయులు	1012
ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య	25,253
2018-19లో విద్యార్థుల సంఖ్య	22,861



పొదలకూరు పాఠశాలలో నిర్మించిన ఆధునిక టాయ్‌లెట్స్



వెంకటాచలంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన బెంచీలు

వైభవంగా శేష వాహనసేవ



శేష వాహనంపై కామక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శేష వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలను ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

ఉపాధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



మాట్లాడుతున్న క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్

పొదలకూరు : ఉపాధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని క్వాలిటీ కంట్రోలు ఈఈ వేణుగోపాల్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో నెల్లూరు క్లస్టర్ పరిధిలోని పొదలకూరు, సైదాపురం, మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూరు, రాపూరు, కలువాయి, తోటపల్లిగూడూరు మండలాల ఉపాధి ఏపీఓలు, టీఏలు, ఈసీలతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కూలీలకు కనీస వేతనం రూ.300 అందేలా చూడాలన్నారు. పనులను నాణ్యతతో కొలతల ప్రకారం చేపట్టాలని సూచించారు. కేంద్రం ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి మండలంలో అమృత సరోవర్లు నిర్మించాలన్నారు. పొదలకూరు మండలంలో పెద్ద సరోవర్లు 2, మినీ సరోవర్లు 4, ఫారంపాండ్లు 100 నిర్మించాల్సి ఉందన్నారు. ఈ పనుల్లో నాణ్యత లేకుంటే టీఏలు, ఈసీలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. డ్వామా ఏపీడీ శంకర్‌నారాయణ మాట్లాడుతూ నెల్లూరు క్లస్టర్ పరిధిలోని ఉపాధి సిబ్బంది బాధ్యతగా పనిచేసి లక్ష్యాలను సాధించాలన్నారు. పొదలకూరు ఎంపీడీఓ మహ్మద్‌రఫీ, ఏపీఓ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శేషేంద్రశర్మ సాహితీ సేవలు ఎనలేనివి



శేషేంద్రశర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు

తోటపల్లిగూడూరు: గుంటూరు శేషేంద్రశర్మ సాహితీ సేవలు ఎనలేనివని పలువురు జిల్లా సాహితీ ప్రముఖులు పేర్కొన్నారు. ప్రముఖ కవి గుంటూరు శేషేంద్రశర్మ వర్ధంతిని ఆయన స్వగ్రామం తోటపల్లిగూడూరులో గురువారం నిర్వహించారు. శేషేంద్రశర్మ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సంస్కృతాంధ్ర భాషలతో పాటు కన్నడ, ఉర్దూ, బెంగాలీ, హిందీ, నేపాలీ, గ్రీకు భాషల్లో తన రచనలను అందించడం గుంటూరు శేషేంద్రశర్మ కవితాశక్తికి నిదర్శనమన్నారు. శేషేంద్రశర్మ అడుగుజాడల్లో నేటి తరం కవులు నడవాల్సిన అవసరం ఉందన్నారు. చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య సమన్వయకర్త పలమనేరు బాలాజీ, ప్రముఖ జ్యోతిష్యులు పాయసం సుబ్రహ్మణ్యం మహర్షి, కవి ఈతకోట సుబ్బారావు, పెరుగు రామకృష్ణ, గుండాల నరేంద్రబాబు, వల్లూరు మాధవరావు, వెంకటప్పయ్య, గుంటూరు సుబ్రహ్మణ్యం, శశిధర్, పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు



సూర్యప్రభ వాహనంపై శ్రీవారు



సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం శ్రీవారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుదర్శన నారసింహమేష్టి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మెంటా సుధీర్‌కుమార్, డాక్టర్ వెంకటసాయిస్పందన, తన్నీరు వెంకటచలపతి సునీతలక్ష్మి దంపతులు వ్యవహరించారు. సాయంత్రం 7 గంటలకు హనుమంత సేవ, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీవారు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెండ్యాల రమణయ్యనాయుడు, వాకాటి శ్రీనివాసులురెడ్డి, గౌరవాధ్యక్షుడు కోనం చినబ్రహ్మయ్య, సభ్యులు ఎం శ్యాంప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, మురళి తదితరులు పర్యవేక్షించారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య సిబ్బందితో ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలి

కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ సేవలు పేదలకు వరమని అదనపు డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని పెమ్మారెడ్డిపాళెంలో యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను గురువారం అందించారు. ఈ కార్యక్రమాన్ని ఏడీఎంహెచ్ఓ పరిశీలించి మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అనేక రకాల ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అందువల్లే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బాగా ఆదరణ పొందిందన్నారు. ఏ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించినా అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి సింధుమేఘన, హెచ్ఎస్‌లు రజియా, మురళీకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఏఎన్ఎం అనిత, ఎస్టీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరంతో బహుళ ప్రయోజనాలు



కొడవలూరు: గ్రంథాలయ శాఖ నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు బహుళ ప్రయోజనాలను పొందవచ్చని రిసోర్స్‌పర్సన్ నెల్లూరు శరణ్య అన్నారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు క్యారమ్స్, చదరంగంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణా శిబిరానికి హాజరవడం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశభక్తి, విజ్ఞానం పెంపొందడంతో పాటు క్రీడలపై ఆసక్తి నెలకొంటుందన్నారు.

- కొడవలూరు గ్రంథాలయంలో విద్యార్థులతో చిత్రలేఖనం సాధన చేయించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి రాజేశ్వరి మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా చిత్రలేఖనంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు.

రమణారెడ్డికి ఉత్తమ పోస్ట్‌మాస్టర్ అవార్డు



అవార్డు అందుకున్న బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ రమణారెడ్డి

కొడవలూరు: మండలంలోని మానేగుంటపాడు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ జీవీ రమణారెడ్డి ఏపీ పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉత్తమ పోస్ట్‌మాస్టర్ అవార్డును అందుకున్నారు. సేవింగ్స్ ఖాతాలు తెరిపించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గానూ ఈ అవార్డును అందుకున్నారు. విశాఖపట్నంలో ఏపీ పోస్టల్ డిపార్ట్‌మెంట్ గురువారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కే ప్రకాష్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఉత్తమ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ అవార్డు అందుకున్న రమణారెడ్డిని పలువురు పోస్టల్ శాఖ అధికారులు అభినందించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



ముస్తాబైన ఆంజనేయస్వామి ఆలయం

మనుబోలు: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, ఉదయం నాగవల్లి దశార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు హనుమాచార్యులు తెలిపారు. శనివారం హనుజ్జయంతి సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు, రాత్రి ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు: క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని ఎస్సై అజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న మండల స్థాయి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో యువత చెడు వ్యసనాలకు బానిసవకుండా క్రీడలు దోహదపడతాయన్నారు. గెలుపోటములకు అధిక ప్రాధాన్యం ఇవ్వకుండా ఆటను ఆస్వాదించాలని సూచించారు. నిర్వాహకులు మాట్లాడుతూ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. విజేత జట్టుకు రూ.15 వేలు, రన్నరప్‌కు రూ.10 వేలు ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేస్తామని వివరించారు. టోర్నమెంట్ స్పాన్సర్లుగా స్థానిక క్రికెట్ క్రీడాకారులతో పాటు వీరంపల్లి గ్రామానికి చెందిన దివంగత చిలిగి శ్రీనివాసులు రెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు, గూడూరు ఎస్వీ మొబైల్స్ వారు వ్యవహరిస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెంకటాచలం: మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహమ్మద్ రఫీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, తదితర సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

సాయిబాబాకు విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని సాయిబాబా మందిరంలో గురువారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భజనలు, రాత్రి పల్లకిసేవ నిర్వహించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపు తప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. నెల్లూరుకు చెందిన రమేష్ పని నిమిత్తం బైక్‌పై గొలగమూడికి వస్తున్నాడు. గొలగమూడి సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటోను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

రేపటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

ముత్తుకూరు: స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను శనివారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రధానార్చకులు నారాయణం రామకృష్ణాచార్యులు గురువారం తెలిపారు. శనివారం ఉదయం సుప్రభాత సేవ, సుందరకాండ పారాయణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ నెల 10న రాత్రి గ్రామోత్సవం, 11న రాత్రి అన్నప్రసాద వితరణతో ఉత్సవాలు పూర్తవుతాయని తెలిపారు. దాతలు, ఉభయకర్తల సహకారంతో ప్రతిరోజూ రాత్రి ప్రత్యేక సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.